# పేపర్ డైవోర్స్

"రుద్రాణిదేవిగారు, ఇది తప్ప వేరే మార్గమేమి లేదండి. ఇలా చేసినా కూడా నష్టం చాలా ఉంటుంది. కానీ, కనీసం ఇది కూడా చేయకపోతే....."

"ఇది తప్ప గత్యంతరమేమీ లేదా?"

"రాబోయే భారీ నష్టాలని భరించడమే. కానీ, అవి అలాంటి ఇలాంటి నష్టాలు కావని అర్థం చేసుకోండి. దీనివల్ల మీ ఇద్దరి దాంపత్య జీవితానికి చిక్కేమీ రాదు. ఇది రెండో కంటివాడికి కూడా తెలియదు. ఇది ఒక చిన్న కాగితానికే పరిమితం. ఎంతోమంది, ఇప్పటికే ఈ పద్ధతిని అవలంభించారు. వారెవరూ, ఇది బయటికి చెప్పటం లేదు. మనం కూడా మరెవరికీ చెప్పక్కర్లేదు. దీనికి కావల్సినవన్నీ నేను అతిగోప్యంగా ఏర్పాటు చేస్తాను."

"కానీ, ఈతతంగమంతా ఎందుకు? మా ఆస్థుల్లో సింహభాగం, ప్రభుత్వానికి వెళ్ళిపోయినా, మిగిలినదాంతో మా శేషజీవితం సుఖంగా గడపవచ్చు. మా తదనంతరం, ఈ ఆస్థినంతా అనుభవించడానికి ఎవరున్నారు? పరిస్థితులిలా ఉన్నప్పుడు, ఈ దొంగనాటకమంతా ఎందుకు?"

"మొదటిపాయింటేమిటంటే, ఇది దొంగనాటకం కాదు. చాలా న్యాయబద్ధమైన ఏర్పాటే. దీనికి మీ ఇద్దరివీ రెండు మూడు సంతకాలే కావాలి. దీనివల్ల మరెవరికీ నష్టం లేదు. మన పూర్వీకులు కష్టపడి సంపాదించి మనకు అప్పజెప్పిన ఆస్తులు, ఏకారణం లేకుండా ఎందుకు ప్రభుత్వానికి దానం చేయాలి? మీ తరువాత మీ ఆస్తులు, అనుభవించడానికి ఎవరూ లేరని చెప్పేంత మించిపోయిందేమీ లేదు. అమ్మా! మీ వయసెంత? ఇప్పుడు ముప్పై అయిదే కదా! ఈ వయసు దాటిన తరువాత కూడా, పెళ్ళిచేసుకున్న ఆడవాళ్ళున్నారు. వారిలో కొందరు పదిమంది పిల్లలకి తల్లులైన వాళ్ళు కూడా ఉన్నారు."

"అర్జునా! నీ అతిశయోక్తికి కూడా ఒక హద్దుండాలి."

"సరే ఇది ఒక చిన్న అతిశయోక్తి అని నేను ఒప్పుకుంటాను. కానీ, ఈ ఇంట్లో కనీసం ముగ్గురు పిల్లలు ముద్దుగా తప్పటడుగులు వేస్తూ నడిచే అదృష్టం ఉంటుందని నామనసు చెప్తోంది."

"నా చెల్లెలు కానీ ఇక్కడికి వచ్చినపుడు, వాళ్ల పిల్లలు అలా నడుస్తారేమో."

"అలాక్కాదు. నేను తమాషాకంటున్నానని మీరనుకోవద్దు. మీకు పిల్లలు కలుగుతారని నా మనసు స్పష్టంగా పలుకుతోంది."

"అర్జునా! నువ్వు వెంటనే వెళ్ళి ఒక భూతవైద్యుణ్ణి కలవాలి. ఇప్పుడే చికిత్స ప్రారంభిస్తే, త్వరగా నయమవుతుంది.'

"ఇప్పుడు నేను చెప్పింది నిజమయితే నా కేమిస్తారు?"

"నువ్వు ఏదడిగితే అది ఇస్తాను."

"ఏదయినా?"

"ఏదయినాసరే!"

"మాట తప్పకూడదు సుమా,"

"అది ఈ జన్మలో జరగదు."

"అవన్నీ అలా ఉంచండి, ప్రస్తుతానికి నన్ను దత్తత చేసుకోకూడదా?"

"ఎందుకు చేసుకోకూడదు? అర్జునా... బాబూ! ఇలారా, నా ఒడిలో కూర్చో"

"ఒడిలో... కూర్చోవడం తప్ప ఇంకేదయినా చేస్తాను. మిమ్మల్ని.... మీ శరీరాన్ని నొప్పించే పనేదీ నేను చేయను."

వాళ్ళిద్దరూ పెద్దగా నవ్వుకొన్నారు. వారి చర్చ మళ్ళీ కొనసాగింది. చిరవకి అర్జునరావే గెలిచాడు. ఒక న్యాయమూర్తి సమక్షంలో ఒక కాగితం ముక్క మీద రుద్రాణి దేవి, భీమరావు, పదిహేనేళ్ళపాటు పరిపావనంగా, పరిరక్షిస్తూ వచ్చిన వివాహబంధం విచ్ఛేదింపబడింది.

ఆ దంపతుల జీవితక్రమంలో ఎటువంటి మార్పు లేదు. వారు ఇదివరకున్న ఇంటిలోనే కాపురమున్నారు. వాళ్ళిద్దరూ కలిసే భోజనం చేస్తున్నారు. కలిసే నిద్రబోతున్నారు. కానీ, చట్టం దృష్టిలో వారు భార్యాభర్తలు కారు.

కొన్నేళ్ళ కిందట, లాండ్ సీలింగ్ గొడవల కాలంలో, జరిగిన ఒక సంఘటన ఇది. అప్పుడు రుద్రాణిదేవి వయస్సు ముప్ఫై అయిదు, భీమరావుకి నలభై. వారిరువురి వయసులు ప్రస్తావించేటప్పుడు, మధ్య అర్జునరావు గురించి మాట్లాడటం అంత మర్యాదగా ఉండదేమో! కానీ, ఇంతవరకు వచ్చిన తరువాత చెప్పకుండా ఉండటం బాగుండదు. అతని వయస్సు ముప్ఫై. అర్జునావు కల్తీబుద్ధికి కొంచెం అటూ ఇటూగా ఉండేవాళ్ళు. ఆ వివాహ విమోచన

యుగంలో కాస్త ఎక్కువ సంఖ్యలో ఉండటం వలన, ఇలాంటి పేపర్ డైవోర్స్‌లు కోకొల్లలని మనకు తెలుసు. అందుకే, వకీళ్ళ ఆ స్వర్ణయుగం గురించి ఎక్కువ వివరించడమక్కరలేదేమో!

కానీ, మీరనుకున్నట్టు, ఈ అర్జునరావు ఒక చెట్టుకింద ప్లీడరేమీ కాదు. అలా అని అతను ఒక పెద్ద ప్లీడరని కూడా మీరు ఊహించుకోకండి. ఏ గొప్పవాడో చనిపోయినప్పుడు, దేశవ్యాప్తంగా శోకం ప్రకటించినా, రేడియోలో, టీవీలో కుక్క ఏడుస్తున్నట్టున్న విశేష సంగీతాలాపన, మన కష్టకాల విలాపంలాగా వినిపించినా, మన అర్జునరావు నల్లకోటు వేసుకోడు. అతను ఏ డ్రస్ వేసుకుంటే ఏమిటి, దిగంబరుడుగా నడిస్తే ఏమిటి కానీ, అతని వృత్తి ఏమిటని మీకింతవరకూ చెప్పలేదు కదూ!

అతను ఒక ఛార్టర్డ్ అక్కౌంటెంట్. ఈ కాలంలో, మామూలు అకౌంటెంట్లలాగా, ఈ జాతివాళ్ళు ఎక్కడ చూసినా దొరుకుతారు కానీ, ఆ కాలంలో కాగడాపెట్టి వెదికితేనే వాళ్ళు దొరికేవాళ్ళు. కొన్ని సంవత్సరాల క్రితం, గుంటూరు జిల్లాలో పొగాకు పంటవేసిన వాళ్ళు నాలుగు రాళ్ళు సంపాదించుకోవడం చూసి చాలామంది వేలంవెర్రిలా ఆరంగంలోకి దూకారు. ఒకచోట ఉండవలసిన వాళ్ళకంటే, చాలా ఎక్కువమంది ఉన్నప్పుడు, వాళ్ళందరికీ ఉక్కిరి బిక్కిరి అయినట్లుగా, ఆ పొగాకు బిజినెస్సులో కూడా అదే పరిస్థితి ఏర్పడింది. వారిలో కొంతమంది పత్తిసేద్యం మొదలు పెట్టారు. అది చూసి, గాలిలో ఎగురుతున్న దూదిపింజలన్నీ నాశనం అయినట్లు, ఆ బిజినెస్‌లో కూడా, చాలామంది లక్షాధికారులు, కష్టాధికారులుగా, నష్టాధికారులుగానే గాక భిక్షాధికారులుగా కూడా పరిణమించారు. ఇదేవిధంగా, కొన్నిచోట్ల, వకీళ్ళకి, డాక్టర్లకి, కూడా కష్టకాలమొస్తుంది. వారి సంఖ్య విపరీతంగా పెరిగిందని చెప్పి, రోగాలకి, గొడవలకి కూడా అలాంటి వికాసం జరగాలని ఉందా?

అర్జునరావు చార్టర్డ్ అకౌంటెన్సీ పాసైన కాలంలో, ఆ క్వాలిఫికేషన్ ఉన్నవాళ్ళు చాలా తక్కువ. ఆ కారణంవల్ల, బ్రతుకుతెరువు కోసం అతను అటూ ఇటూ పరిగెత్తనవసరం లేకపోయింది. ఒక జ్యేష్ఠ విద్వాంసుడి దగ్గర రెండు మూడు సంవత్సరాలు పనిచేయాల్సి వచ్చింది. ఆ అవకాశాన్ని సద్వినియోగపర్చుకుని, కావాల్సిన పరిచయాలు సంపాదించి అతని స్వంత ప్రాక్టీసు అతి త్వరలో ప్రారంభించాడు. దానికి కావాల్సిన ప్రేరణ నిచ్చినది వేరెవరో కాదు, చిక్కని కట్నంతోపాటు, అతని జీవితంలో అడుగిడిన చక్కని చుక్క గిరిజ.

ఛార్టర్డ్ అకౌంటెంట్ అనే వస్తువు ఒక జలగలా ఉంటుంది. ఒక్కసారి పట్టుకుందంటే మరి వదలదు. కావాల్సినంత రక్తం పీల్చుకున్న తరువాతే అది పట్టు వదులుతుంది. ఒక వ్యాపారవేత్త ఛార్టర్డ్ అకౌంటెంట్ సహాయం తీసుకుంటే అతని వ్యాపార రహస్యాలన్నిటినీ ఆ ఛార్టర్డ్ అకౌంటెంట్ తెలుసుకుంటాడు. అలా తెలుసుకుని, ఇన్‌కంటాక్స్, సేల్స్ టాక్స్,

కమర్షియల్ టాక్స్, స్టేట్ ఎక్సైజ్ అనే పంచభూతాల నుంచి, పాపం! ఆ వ్యాపార వేత్తలను కాపాడి పస్తులతో దిష్టిబొమ్మలు అయిపోకుండా, అభయహస్తమిచ్చే వాళ్ళే కదా, ఈ మహాగణిత కోవిదులు. తన శరీరంలో ఉన్న చెడురక్తాన్ని పీల్చేసి, మిగిలిన రక్తాన్ని శుద్ధి చేయడానికి కాకపోయినా, మొత్తం రక్తంలో ఉన్న ఆ కాలుష్యం లేనట్టు చూపించడానికే కదా ఆ బిజినెస్‌మెన్ ఈ జలగచేత కరిపిస్తాడు. ఆ విధంగా ఒక్కసారి కరిపించుకుంటే, ఆ జలగకీ మనిషికీ మధ్య ఒక రకమైన సంబంధమేర్పడుతుంది. వారిమధ్య ఆ రక్తసంబంధం తెగాలంటే, వారిలో ఒకరు కాటికి చేరాల్సిందే. ఆ జలగడు అతి సమర్థుడైతే, అతని దహనకాండానంతరం కూడా ఆ సంబంధం తెగిపోదు. అదెలా అంటే, కాటియాత్ర తరువాత కూడా, ఆ జలగడు అతని వారసులని కరుచుకుని, వాళ్ళ దుష్టరక్తాన్ని, శిష్టరక్తంగా పరివర్తన చేయడానికి సహాయపడతాడు.

కొంతమంది వాణిజ్య దిగ్గజాలు, ఛార్టర్డ్ అకౌంటెంట్‌ని కేవలం జలగగానే వాడరు. వాళ్ళకు ఆ జంతువు ఉడుముగా మారుతుంది. ఆ ఉడుముతోకకి, తాడుకట్టి దాన్ని ఒకకోటపైకి విసిరితే, పట్టు వదలకుండా అది అక్కడే అలా ఉంటుంది. దుర్గాధిరోహణం చేయాలను కొనేవాళ్ళకి, ఆ తాడు ఆసరా అవుతుందని, మనం చరిత్రలో చదివి ఉన్నాము. ఛత్రపతి శివాజీ కూడా ఉడుముని వాడినట్లు సాక్ష్యాధారాలున్నాయి. ఈ కాలపు బడా ధనవంతులకు ఆదాయపు పన్ను కోట దాటడానికి ఈ ఉడుము చాలా అవసరం. వాళ్ళ నల్లరక్తాన్ని ఎర్ర రక్తంగా చెయ్యడానికి అలాంటి ఇలాంటి జలగలు చాలవు. తెల్లధనం కన్నా నల్లధనం ఎక్కువగా ఉన్న ఈ కాలంలో మామూలు ఛార్టర్డ్ అకౌంటెంట్స్ పనికిరారు. అర్థశాస్త్రంలో, అనర్థశాస్త్రంలో పి. హెచ్.డి. తీసుకున్న సాక్షాత్తూ కుకౌటిల్యులు దారి చూపిస్తేనే, ఈ యుగపు కోట్లకు పడగలెత్తిన జాతి తస్కర గజేంద్రనాటకం ఆడగలరు.

అర్జునరావుకి, రుద్రాణిదేవి ఇంటిలో కాలు పెట్టగలిగిన మహాద్భాగ్యం ఒక ప్రత్యేక రీతిలో కలిగింది. రుద్రాణిదేవి కుటుంబానికి మొదట్నుంచీ ఉన్న మహాగణికుడు, రాఘవశాస్త్రి. అతను నలుపుల్ని తెలుపులు చేయడం, వివాహబంధాన్ని కాగితం మీదయినా సరే, తెగ్గొట్టడం వంటివి మహాపాతకంగా భావించేవాడు. మహాభక్తుడైన అతనికి, వృత్తిపరంగా పెద్ద పరిచయాలు అయ్యేవి కావు. అబద్ధాలు చెప్పడానికయినా, చెప్పించడానికయినా, వెనుకాడే ప్లీడర్ల దగ్గరికి, ఏ పార్టీలయినా వెడతారా? రాఘవశాస్త్రి ఆ కోవకు చెందినవాడే. శాఖాహారి అయిన ఆ శాస్త్రి దొరికిన దానితో సంతృప్తిచెందేవాడు. అంతేకాకుండా, ఆదాయంలో అర్థభాగం వరకూ, ఆ సర్వేశ్వరుని జీర్ణోద్ధరణ నిధికి సమర్పించుకునేవాడు. అలాంటి పవిత్ర దానాలు, తను శ్రీకైవల్యపదాన్ని చేరడానికి కట్టే ఇన్‌స్టాల్‌మెంట్స్ అవుతాయని ఆయన నమ్మేవాడు.

భీమరావుకి, రుద్రాణిదేవికి ఆ మంచివాడంటే ఎంతోప్రీతి. అతని కారణంగా, ప్రభుత్వానికి చాలా డబ్బు ప్రతిసంవత్సరం కట్టవల్సి వస్తుందనే భావం. ఆ సంపత్ దంపతులకు ఉండేది కాదు.

అతని పూర్వీకులు కట్టించిన రెండంతస్థుల ఇంటిపైభాగంలో శాస్త్రి ఉండేవాడు. క్రింది అంతస్థు మాంసం భుజించడం కానీ, దాని గురించి ఆలోచించడం కూడా చేయని ఒక సాత్త్విక బ్రాహ్మణ కుటుండానికి అద్దెకి ఇచ్చాడు. ప్రభాత పూజకు కావలసిన పువ్వులు, ఇంటి ఆవరణలో ఉన్న చెట్ల నుంచే లభ్యమయ్యేవి. ఉదయం మేడ ఎక్కి అక్కడి వరకూ పాకిన లతల నుంచి పువ్వులు తెంపడం అతనికి అలవాటు. ఒకరోజు అతను అలా పువ్వులు కోస్తూ ఉండగా, పిట్టగోడకి ఆనుకుని నిలబడి, కాస్త దూరంలో ఉన్న రెండు, మూడు పువ్వులు కోయడానికి ప్రయత్నించగా, రెండు కాళ్లూ పైకి లేచి, తలక్రిందులుగా కిందనున్న సిమెంటు నేలమీదపడి తక్షణం పరమపదం పొందాడు. శాస్త్రిగారి అకాల మరణం తరువాతే, అర్జునరావుని రుద్రాణిదేవికి ఎవరో పరిచయం చేసారు. మొదటి సంవత్సరంలోనే శాస్త్రి ప్రభుత్వానికి కట్టించిన మొత్తంలో యాభైశాతం వరకూ అర్జునరావు తగ్గించగలిగాడు. రెండు సంవత్సరాలపాటు ఆ యువ సి.ఎ. అవలంభించిన పద్ధతులు ఆ దంపతులకి భయంగా ఉండేవి కానీ, ఆ రెండు సంవత్సరాల తరువాత వారి దాంపత్యాన్ని కాగితంపైన చీల్చడానికి కావలసిన గుండెబలం వాళ్ళకు అతను కలిగించగలిగాడు.

అర్జునా, ఫల్గుణా, పార్థా, కిరిటీ, శ్వేతవాహనా, అని జపిస్తూ కాలం గడుపుతున్న గిరిజ అనే భార్య, రెండేళ్ళ వయసు గల లక్ష్మి అనే కూతురు, ఆ ముప్పై ఏళ్ళ అర్జునరావుకు ఉండేవారు.

రుద్రాణిదేవికి, భీమరావుకి రెండు వేర్వేరు కుటుంబాలను కల్పించి, వారి ఆస్థిలో భీమభాగం ప్రభుత్వానికి పోకుండా కాపాడిన తన తెలివితేటలు గురించి అర్జునరావు గొప్పలు చెప్పుకుంటుంటే, గిరిజకు అతనిపై నింగినంటిన అభిమాన సౌధం బీటలు వారింది.

ఒకరోజు రాత్రి భోజనానంతరం, గిరిజ దిగ్భ్రమ చెందే ప్రతిపాదన చేశాడు, అర్జునరావు.

"భీమరావు దంపతుల్లాగే, మనం కూడా కాగితపు విడాకులు తీసుకుందామా?"

తను విన్నమాట ఆమెకు నమ్మశక్యం కాలేదు. అయినా, "ఎందుకు?" అని అడక్కుండా ఉండలేకపోయింది.

"అద్దె ఇంట్లో ఉండకుండా, ఈ సిటీలో రెండు పెద్ద బంగ్లాలు కట్టుకోవాలి. ఒకటి మన లక్ష్మికి, రెండవది మనకు పుటబోయే కొడుకి."

"దానిగురించి మనమ్మాయి లక్ష్మికి, ముందెప్పుడో పుట్టబోయే అబ్బాయికి, తల్లీ తండ్రీ లేకుండా చేయాలా?"

"మనిద్దరం బ్రతికే ఉంటాం కదా! మరి వాళ్ళకి తల్లీ తండ్రీ లేకపోవడం ఏమటి?".

"డైవోర్స్ తీసుకున్న తరువాత, మనం వాళ్ళ తల్లిదండ్రులుగా ఎలా కొనసాగుతాం? మనం విడివిడి మనుష్యులమై పోతం కదా! నా భర్తగాని మీనుంచి నేను ఒక కొడుకుని ఎలా కనగలను?"

"డోంట్‌బి సిల్లీ గిరిజా! భీమరావు, రుద్రాణిదేవి భార్యాభర్తలుగా ఉండటం లేదనా నీవనేది?"

"అవును. చట్టరీత్యా వాళ్ళమధ్య నున్న వివాహబంధం తెగిపోయిన తరువాత, ఇప్పుడు కూడా వారు దాంపత్య జీవితం కొనసాగిస్తే, అది సదాచార విరుద్ధమే."

"గిరిజా! కొంచెమయినా ప్రాక్టికల్‌గా ఆలోచించవేమి? నువ్వు మరీ పాతకాలపు అమ్మమ్మలా మాట్లాడుతున్నావు."

"మరే విషయంలోనయినా ఈ థియరీలు, ప్రాక్టికల్స్ పెట్టుకుంటే అభ్యంతరం లేదు. ఇంత పవిత్రమైన వివాహ బంధాన్ని ఈ విధంగా పరిహసించకూడదు. ఒక భారతీయ వనితకు, విడాకులు తీసుకోవడానికంటె, సుమంగలిగా చనిపోవడమే అభిలషణీయం."

"చాలు...చాలు, ఆపు, నీ అధిక ప్రసంగం. ఇప్పుడు మీ తండ్రి ప్రొఫెసర్ కోదండ పాణిలాగా మాట్లాడుతున్నావు."

"ఇలాంటి ప్రతిపాదన గురించి, ఆయన వింటే మాత్రం నన్ను మాటలతో వదలిపెట్టరు సరికదా, ప్రాణాలేతీస్తారు."

"ఆ విషయాన్ని తలకెక్కించడానికే నేను చేసే ప్రయత్నం. ఈ సంగతి మనిద్దరికీ తప్ప మూడో వాళ్ళకి తెలియనక్కరలేదు. అర్బన్ సీలింగ్ లాండ్ ప్రకారం ఈ నగరంలో మనం పన్నెండు వందల గజాల స్థలమే కొనుక్కోగలం. ఈ డైవోర్స్ యుక్తితో అటువంటి ప్లాట్లు రెండు కొని, రెండు పెద్ద బిల్డింగ్స్ కడదాము. ఒకటి నా పేరుతో ఉంటుంది. రెండోది నీ పేరుతో ఉంటుంది. నీ ఇష్టప్రకారము, మనం ఒక ఇంట్లో ఉండి మరో ఇల్లు అద్దెకి ఇచ్చుకోవచ్చు."

"పెళ్ళి అయిన తర్వాత, మీదీ నాదీ అనే తేడా ఉండకూడదు. ఉన్నదంతా మనిద్దరిదీను.

కాబట్టి మనకొక ఇల్లు చాలు, మరో ఇల్లు కట్టుకోవాలనుకుంటే, లక్ష్మి మైజరైన తరువాత కట్టుకోవచ్చు."

"ప్రతిదీ నువ్వనుకున్నట్టే జరగాలా? నాకంటూ ఏ అభిప్రాయాలు ఉండకూడదా? భర్త మాట తు.చ. తప్పకుండా పాటించడమే భార్య కర్తవ్యం."

"అదే కదా! నేనంటున్నది, చివరి వరకూ మనం భార్యాభర్తలుగానే బతుకుదాం."

"అవును అలాగే బతుకుదాం. అందుకే కదా దీన్ని వట్టి పేపర్ డైవోర్స్ అని అంటున్నది."

"నావల్ల కాదు."

"నేను అదేచేసి తీరుతాను."

"రేపు నీకు నేను డైవోర్స్ నీటీసు పంపుతాను. మిగిలిన విషయాలు కోర్టులో తేల్చుకుందాం. అప్పుడు ఊరంతా మారు మ్రోగిపోతుంది."

"మీరింత కఠినంగా ఎలా మాట్లాడగలుగుతున్నారు?"

"నీ గురించి, నా గురించి, లక్ష్మి గురించి, ఇంకా కావలిస్తే మనకు పుట్టబోయే కొడుకు - మనందరి క్షేమం గురించే కదా నేను ఇలా ఆలోచిస్తున్నది. నేనెంత మంచి భర్తని కాకపోతే, ఆ రెండవ ఇల్లు కట్టి ఒక చక్కని చుక్కకి ధారపోసే వాడిని కదా! అప్పుడు, ఆ ఇల్లు-ఇల్లాలూ రెండూ కూడా నాదవుతాయి. కానీ, నేను మరో ఆడదాన్ని కలలో కూడా ఊహించలేను. అందుకేకదా, ఇలాంటి ప్లాన్ వేస్తున్నాను. కావాలంటే, భీమరావు, రుద్రాణిదేవీ ఎలా జీవిస్తున్నారో, నువ్వొచ్చిచూడు. వారి పాత జీవితం, కొత్త జీవితం మధ్య ఏదయినా మార్పుందేమో, నువ్వే తెలుసుకుంటావు. ఉన్న మార్పల్లా వాళ్ళ ఆస్థిలో కొంతభాగం ప్రభుత్వం చేతిలో పడకుండా నిలిచింది... పన్ను భాగం కూడా సగానికి తగ్గింది, అంతే."

"ఎటువంటి ప్రయోజనాలున్నా కానీ,...."

"పిచ్చిదానా! నీకు లోకజ్ఞానం అస్సల్లేదు. ఈ దేశంలో చట్టాలన్నీ హిందువులకు వ్యతిరేకంగానే ఉన్నాయి. హిందూ అవిభక్త కుటుంబమని నువ్వు వినుంటావు కానీ, అలాంటిదే క్రైస్తవ అవిభక్త కుటుంబమని కానీ, ముస్లిం అవిభక్త కుటుంబమని కానీ, నువ్వు ఎప్పుడయినా విన్నావా ఒక ముస్లిమ్‌కు ఒకే సమయంలో నలుగురు భార్యలుండవచ్చు. అటువంటి ఉద్దేశ్యమేమీ నాకు లేదే? నాకున్న ఒకే ఒక్క భార్యకి అందమైన ఒక స్వంత బంగ్లా కట్టివ్వాలని నా కోరిక. అంతే కాదు, వచ్చే సంవత్సరం నుంచీ నువ్వు ఒక ఇన్‌కంటాక్స్ అసెస్సీ

కాబోతున్నావు. ఆదాయం, ఒక్క నాపేరు మీదే చూపిస్తే, చాలా టాక్స్ కట్టాల్సి వస్తుంది. దానిలో సగం నీ పేరుమీద చూపిస్తే, పన్ను భారం చాలా తగ్గిపోతుంది.”

ఇటువంటి చర్చలు, ఏడ్పులూ, ఓదార్పులూ కొంతకాలం కొనసాగుతూనే వచ్చాయి. కానీ, అర్జునుడి అస్త్రం గురి తప్పుతుందా? ఆ దంపతులకు కూడా పేపర్ డైవోర్స్ ప్రాప్తించింది.

ఇప్పుడు దృశ్యం మారుతుంది. రాబోయే డైలాగులు అర్జునరావు, రుద్రణిదేవి మధ్య నడుస్తాయి.

ఒకరోజు వాళ్ళిద్దరూ ఆమె తోటకి వెళ్లారు. కావాలంటే, వాళ్ళిద్దరూ పగలంతా అక్కడే కూర్చుని మాట్లాడుకోవచ్చు. దానికేవిధమైన విఘ్నం ఉండదు. అంతేకాదు, మూడోవాడిచెవిన కూడా పడదు. వాళ్ళిద్దరూ రకరకాల రసవత్తరమైన సంభాషణలు జరుపుతున్నారు. “ఊర్వశీ శాపం ఉపకారమైంది అనే పాత సామెత మీరు వినలేదా రుద్రాణిదేవి గారు!” అని అనుకోకుండా అడిగాడు అర్జునరావు.

అది విన్న రుద్రాణిదేవికి నవ్వొచ్చింది. “ఏం బాబూ! నీపేరు అర్జునుడైన మాత్రాన, నీ రథానికి ఆ కృష్ణపరమాత్మ సారథిగా వస్తాడని కలలు కనకు. నీ వయస్సుకి ఈ ఊర్వశీ, మేనక, తిలోత్తమ, రంభలని తలుచుకోవడం సహజమే కదా!”

“ఛ.... ఛ... ఇంతకాలం ఇంత దగ్గరగా మసలిన తరువాత కూడా నేనేంటో, మీకర్థం కాలేదా? అందమైన అమ్మాయిలు కోకొల్లలు. వారిని వశపర్చుకోవడమేమంత కష్టమైన పనికాదు. కానీ ఆ విషయంలో నాకంత ఆసక్తిలేదని మీకు తెలియదా? కాలేజీలో చదువుకునే రోజుల్లో కూడా నాకటువంటి బలహీనతలుండేవి కాదు.”

“దాన్ని బలహీనతని ఎందుకనాలి? చాలామంది అబ్బాయిలు అదో ఘనతగా భావిస్తారు. అలాంటి యువకులంటే, యువతులకు కూడా ఇష్టమే. అది సరే కానీ, ఈ ఊర్వశీ శాపం ఉపాఖ్యానం ఎందుకు?”

“ఆ సంఘటనకి వ్యతిరేకమైన ఒక సంఘటన ఇక్కడ జరిగితే?”

“అంటే?”

“ఆరోజు ఊర్వశి, అర్జునుడి ప్రేమను అభ్యర్థించింది. ఈ రోజు అర్జునుడు ఊర్వశినుండి ప్రేమను అర్థిస్తే?”

“నువ్వెవరయినా ఊర్వశిని చూసుకున్నావా?”

"ప్రస్తుతానికి, మీరే ఆ ఊర్వశి కాకూడదా?"

"అర్జునా! మాట్లాడటానికి కూడా ఒక హద్దుండాలి. నువ్వెవరితో మాట్లాడుతున్నావో మర్చిపోకు నేను నీకు అక్కలాంటిదాన్ని."

"అది నిజమే! ఆ అర్జునుడి విషయంలో కూడా ఇటువంటివి, లేదా దీన్ని మించిన తేడా వయసులలో ఉంది. అర్జునుడు ఊర్వశిని తల్లిగా భావించాడు.'

"అర్జునా! ఏమైంది నీకివాళ. దారిలో ఏపిచ్చి కుక్కయినా కరిచిందా?"

"రుద్రాణిదేవిగారూ! ముందు పురాణాల గురించి మాట్లాడుకుందాం... తరువాత మన సంగతులు..."

"నువ్వు ఏం మాట్లాడాలనకున్నా మాట్లాడు. కానీ, నాకు మాత్రం పురాణాల గురించి ఏమంత తెలియదు."

"ముందు, మనం శివపార్వతుల విషయం గురించి చర్చిద్దాం. శివుడు – పురుషుడని, పార్వతి – శక్తి లేదా ప్రకృతి అని కదా అంటారు. ఈ ప్రకృతి – పురుషుడు కలిస్తేనే కదా వంశవర్ధనం. అందుకే, మనం శివలింగాన్ని పూజిస్తున్నాం. ప్రకృతి–పురుష సంగమం మనం మరిచిపోతే, సృష్టిక్రమంగా అంతరించిపోతుంది."

"అబ్బో! నువ్వేం తక్కువ తినలేదే?" అంటూ ముక్కుమీద వేలేసుకుంది.

"ఇప్పుడు కథ మంచి రసపట్టుగా సాగబోతోంది. శివుడి యొక్క శక్తిమంతమైన ఆయుధమేమిటి?"

"ఆ ముసలివాడి మూడోకన్నే కదా!"

"అవునంతే! అది తెరిచే కదా, మన్మధుణ్ణి శివుడు భస్మం చేసింది. ఒక పింప్‌లా పనిచేసిన ఆ మన్మథుడు చేసిన తప్పేమిటి? కళ్ళన్నీ మూసుకుని కూర్చున్న ఆ పరమేశ్వరుణ్ణి ప్రసన్నం చేసుకోవడానికి, పార్వతి అన్ని యుక్తులూ ఉపయోగించి, విఫలమైన స్ట్రిప్‌టీజ్ అని వర్ణించే వివస్త్రీకరణ నృత్యం కూడా చేసింది. అది చూసి, పుష్పబాణుడు ఒక అస్త్రాన్ని సంధించాడు. చంద్రశేఖరుడికి గిలిగింత కలిగింది కళ్ళు తెరిచి పార్వతియొక్క సుందర రూపాన్ని చూసేటపుడు, ఇంకా ఎక్కువ చూద్దానికి మూడో కన్ను తెరిచాడు. ఆ సమయంలో కట్టెదుటనున్న కామదేవుడు ఆక్సైడ్ అయిపోయాడు."

"పురాణాలెప్పుడూ అడవుల్లోనే జరిగాయి కానీ, ఇప్పుడు నీ భావనే అడవి దారి పడుతోంది."

"శివుడు అర్జునుడికి ప్రసాదించిన శక్తిమంతమైన ఆయుధం గురించి ఇందాకా మిమ్మల్ని అడిగాను. దాని పేరే పాశుపతాస్త్రం. పశుపతియొక్క అస్త్రం అని దాని అర్థం. ఇది కూడా శివలింగంలాగానే పనిచేస్తుంది. పాశుపతాస్త్ర మహిమతోనే పశువులకు దూడలు తయారవుతాయి. ఈ రోజుల్లో అన్ని ప్రాంతాల్లో పాశుపతాస్త్రానికి విడిగా ఒక విభాగముంది. దాన్నే ఇంగ్లీషులో, "ఏనిమల్ హజ్బెండరీ డిపార్ట్‌మెంట్" అని అంటారు. ఏనిమల్ హజ్బెండరీ అంటే పశుపతి యొక్క స్థానం... సామర్థ్యం... ప్రయోజనమనే వ్యాఖ్యానించాలి కదా!"

"రుద్రాణిదేవి గారూ! పురాణ పాండిత్యం నాకెలా వస్తుంది? వాటిమీద సరియైన అవగాహన కలగాలంటే, సంస్కృతంలో ప్రవేశముండాలి. నాకయితే, దాంట్లో ఎబిసి కూడా తెలియదు. కొంతమంది పండితుల సాంగత్యం వలన ఏదో కాస్త కాస్త తెలుసుకున్నాను. అది ప్రకటించడానికి కొద్దిగా అవకాశం దొరకాలి కదా!"

"దానికి నేనే దొరికానా? మరో ఎర దొరకలేదా?"

"ఎరకావడంలో ఉన్న మజా మీరు ఒక్కసారి అనుభవిస్తే మాత్రం రాత్రింబవళ్ళూ మీరు ఎరకావాలనే కోరుకుంటారు."

"నాకు అలాంటి మజా తెలుసుకోవాలని లేదు, సరికదా, అటువంటి కోరిక నాకెప్పుడూ కలగలేదు."

అలా ఖచ్చితంగా మాట్లాడకండి. మనుష్యుల జీవితాల్లో ఏది, ఎప్పుడు, ఎలా జరుగుతుందనేది ఎవ్వరూ ఊహించలేరు. జీవితకాలావధియే ఎంతో పరిమితం. రకరకాల సంఘటనలతో నిండిన ఒకరి జీవితంలో, దాన్ని పూర్తిగా ఆస్వాదించడానికి సమయం చాలదని అనిపిస్తుంది. అదే సమయంలో, జీవితం ముందూ, వెనుకలు, ఒక ఎడారిలా చూస్తూ కాలం గడిపే వారికి భవిష్యత్తులో పంటపండిచడానికి కావలసిన ఆశాబీజాలు, భూత, వర్తమాన కాలాల్లో వేయలేనివారికి కేవలం మరణమనే గమ్యస్థానాన్ని ప్రతీక్షిస్తూ బతికేవాళ్ళకి, జీవితం ఒక అసహనీయమైన దీర్ఘకాలంలా గోచరిస్తుంది. వారి పగటి సమయం, రెక్కలూడిపోయిన మిణుగురు పురుగు పాకుతూ వెళుతున్నట్టు ఎంతో దుర్భరంగా గడుస్తుంది. మనిషికి రేపటికి కావలసిన ప్రేరణ, ఈనాటి ఆశలమీదే ఆధారపడుతుంది. కానీ, ఆశలే మనిషికి దుఃఖకారణమవుతాయి. ఆశల్ని ఎంతగా పరిమితం చేసుకుంటే, అంతగా జీవితం సుఖప్రదమవుతుంది. అందుకే, మనసుపైన గట్టి నియంత్రణ పాటించాలని, బుద్ధ భగవానుడు ఉపదేశించాడు. కానీ, ఈ విషయంలో నా అభిప్రాయమేమిటో తెలుసా, గౌతమబుద్ధుడి ఆదేశాలు పాటించే వాళ్ళందరూ బిచ్చగాళ్ళని, ఎందుకంటే వాళ్ళు బౌద్ధ భిక్షువులుగా

పరిణమించాలి కదా! ఒక దేశంలో అందరూ బౌద్ధ భిక్షువులుగా మారితే, ఇక వారికి భిక్ష వేయడానికి ఎవరుంటారు? ఆపని వరల్డ్ బ్యాంకు వాళ్ళు చేస్తారా? మనిషికి బతకడానికి కావలసినది కేవలం భోజనం మాత్రమే కాదు, ఆశలు, అభిలాషలు కూడా అతనికి చాలా వసరం."

"ఏమిటీ! నువ్వు ఛార్టర్డ్ అకౌంటెన్సీ ప్రాక్టీసు వదిలేసి వేదాంతం ప్రాక్టీసు మొదలుపెడుతున్నావా? అయినా, ఇవన్నీ నువ్వు నాకెందుకు చెప్తున్నావు? భవిష్యత్తు మీద దృష్టి సారించడానికి నాకేమీ లేదనా నీ ఉద్దేశ్యం? నా జీవితంలో, ఆశించడానికీ, ఎదురు చూడ్డానికీ, ఇహ ఏమీ లేదనే నువ్వనుకుంటున్నావా?"

"ఆశలు చిగురించకపోవడానికి మీకేమంత వయస్సు మించిపోయిందని, నిజానికి ఆడవాళ్ళ చిలిపితనం బయటపడేది నలభైదాటిన తరువాతేనని నేను విన్నాను. పాశ్చాత్య దేశాల్లోని స్త్రీలు వైవాహిక జీవితం మొదలు పెట్టేదే మీ వయసులో. జీవితంలో అతి ముఖ్యమైన విషయమేమిటంటే, జీవితాన్ని జీవితంలోనే అర్థం చేసుకోవడం, జీవితాన్ని కొన్ని నీతి నియమాలకు పూర్తిగా లోబడేటట్టుచేసి, బతకవలసిన బతుక్కి దురదృష్టమనే రంగు పూసి, తన తలరాతని తనే నిందించుకోవడానికి సిద్ధపడితే, ఆశాభావమనే పదానికి అర్థం లేకుండా పోతుంది. సదాచారనీతులు, నియమాలు, చట్టాలు, ఇవన్నీ మానవ మస్తిష్కంలో ఉద్భవించినవే. వాటికి దైవికత్వం, ఆపాదించడం మూర్ఖత్వం. సదాచార నియమాలు అంత దివ్యమయితే, సతీసుమతి కుష్టురోగియైన తన భర్తను గంపలో నెత్తినపెట్టి వేశ్యాగృహానికి తీసుకువెళ్ళాలనీ, పాపం ప్రభాకరుణ్ణి, దిక్చక్రపు పాదాల అడుగున ఒక రోజంతా అణగబెట్టి ఉంచాలనే భావం కలగాల్సిన అవసరముండేది కాదేమో! పురాణాల్లోకి తొంగి చూస్తే, నీతులని చెప్పేవాటిని తమ సౌకర్యార్థం ఉల్లంఘించిన సందర్భాలెన్నో ఉన్నాయి. ఆ ఉల్లంఘనలని రకరకాలుగా సమర్థించడం కూడా జరిగింది. ఒక మత్స్య గంధిని దర్శించడంతోనే ఒక మహాముని శరీరానికి పులకరింత కలిగింది. నట్టేటిపై నడయాడే నావపై, మంచుతెర సహాయంతో నడవాల్సింది నడిచిపోయింది. ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుల జన్మరహస్యం రుద్రాణిదేవికి తెలుసనే నేను అనుకుంటున్నాను."

"అవన్నీ నాక్కూడా తెలుసులే, కానీ, ఇలాంటి ఉపన్యాసాలు నాకు వినిపించడంలో మీ ఉద్దేశ్యమేమిటి?"

"చూడండీ, దాగుడుమూతలనే జబ్బు మామూలు మనుష్యుల్లో చాలామందికి ఉంది. కానీ, ఈ దాక్కోవడం ఎవరినుంచి? అప్పుడప్పుడు మననుంచి మనమే దాక్కొనే ప్రయత్నం చేస్తాము. అది అవసరమా? ఏ స్త్రీకి అయినా, తల్లి కావాలనే కోరిక సహజమే. ఆమెకు

జన్మసాఫల్యం, మాతృత్వమనే సోపానం ఎక్కినప్పుడే ప్రాప్తిస్తుంది. మానవ శరీర ప్రకృతి గురించి ఒక్కసారి ఆలోచించండి. మాతృత్వమనే మహనీయ స్థాయికి చేరుకున్నప్పుడే, స్త్రీకి తన రక్తాన్ని క్షీరముగా పరిణమింపజేయడం సాధ్యమవుతుంది. ఎవరయినా, ఒక ఆవుని గొడ్డావని తెలిసి మరీ కొంటారా? కానీ, మనుష్యుల విషయమలా కాదే, కొన్ని స్త్రీ, పురుష సంయోగాలు ఫలవంతం కావు. బ్లడ్ గ్రూపుల్లో పొంతన లేకపోవచ్చు. లేదా మరేదయినా కారణాలు కూడా కావచ్చు. ఒకటి రెండేళ్ళు ప్రయత్నించిన తర్వాత, ఒక తప్పుడు అవగాహనలో పడకూడదు. కానీ, ఎనిమిది, పది సంవత్సరాల భగీరథ ప్రయత్నాల తర్వాత కూడా సరియైన అవగాహనా స్థితికి చేరకపోతే, దాన్ని మూర్ఖత్వమనే అనాలి. మహాభారతపు పుటలు తిరగేస్తే, కుంతీదేవికి, తన భవిష్యత్తును గూర్చి, పెళ్ళికిముందే జ్ఞానం కలిగినట్లు తెలుస్తుంది. ఆమె తన జాతకాన్ని ముందే చదివేసిందేమో! పాండురాజు ద్వారా తనకు పిల్లలు కలగరని ముందుగానే తెలియడం వలననే ఒక టెస్ట్‌కేస్‌గా కర్ణుడ్ని సృష్టించింది. సత్సంకల్ప సిద్ధి కొరకు బహు భార్యాత్వము గానీ, బహు బర్తృత్వము గానీ అవలభించడంలో తప్పులేదని పురాణాలు ఘోషిస్తున్నాయి. స్వానుభవం ద్వారా ఎంతో జ్ఞానం సంపాదించుకున్న కుంతీదేవి, తనకు కలిగిన అపకీర్తి ఎంతమాత్రం కోడలికి, రాకూడదనేమో ఆమెకు పంచభర్తృత్వమనే వరప్రసాదాన్ని ఇచ్చింది."

"చాలు బాబోయ్, చాలు నీ మహాభారత మహాప్రసంగం, ఇక ఆపు. ఈ ఉదాహరణలన్నీ నా జీవితానికి అన్వయిస్తూనే కదా నువ్వు చెపుతున్నావు. అయితే, నేను ఇప్పుడు ఏం చేయాలంటావు?"

"మీరొక తల్లి కావాలి?"

"దైవేచ్ఛ ఎలా ఉంటే అలా జరుగుతుంది."

"మానవ ప్రయత్నం సగం - మాధవ ప్రయత్నం సగం. దేవుడు మనకి సహాయం చేయాలంటే, మనం దేవుడికి సహాయం చేయలి కదా! కనీసం, ఇప్పటినుంచి, రుద్రాణిదేవి ద్రౌపదిగా మారాలి. ఒక్కొక్క బిడ్డకోసం, ఒక్కొక్క మగవాణ్ణి వరించాల్సిన అవసరం లేదు. అన్నివిధాలుగా మీకు సరిపోయే ఒకడు చాలు కదా! ఈ ఒక్క లక్ష్యం కోసం మీతో కలవాలని నేను ఆకాంక్షిస్తున్నాను. అందుకు నేను సిద్ధంగా ఉన్నాను."

"ఏమిటి, అర్జునా! ఈ పిచ్చి పిచ్చి మాటలు? నువ్వు సంసిద్ధమయ్యావా? దేనికి?"

"మీరు ఒక పేపర్ డైవోర్స్ ద్వారా మీ భర్తనుంచి విముక్తురాలు అయినట్టు, నేను కూడా భార్యావిముక్తుణ్ణి అయ్యాను. ఈ రోజు మనం స్వేచ్ఛాజీవులం. ఒక మంచి ఉద్దేశ్యంతో మనం కలుద్దాం."

"అర్జునా! ఎంత ఘోరం చేసావు? పాపం, ఆ ఇల్లాలికి ద్రోహం చేస్తావా?"

"నేనెవ్వరికీ ద్రోహమూ చేయడం లేదు, వంచించడమూ లేదు. నా భార్యను ఎప్పటిలాగే ఇప్పుడు కూడా నేను ప్రేమిస్తున్నాను. కానీ, మన కొత్త సంబంధానికి బలమైన సమర్థన కొరకు... కావాల్సిన నైతికాధారం కొరకే, మనమిద్దరం ఇలా స్వతంత్రులమయ్యాము. ఇహ, ఒక పవిత్రమైన వైవాహిక బంధంలో మనమిద్దరం ముడిపడవచ్చు."

"అర్జునా! ఇలా పిచ్చిపిచ్చిగా మాట్లాడకు, నా వయసెంత? నీ వయసెంత?"

"రుద్రాణిదేవిగారూ! మనిద్దరికీ ఇప్పుడు వివాహప్రాయమని అనుకుంటే చాలు. షేక్స్పియర్ భార్య అతనికన్నా పద్దెనిమిది సంవత్సరాలు పెద్దదని నేను విన్నాను."

"అందుకేనా అతను అన్ని విషాదనాటకాలు రాశాడు? ఏదేమయినా, నాకు ఒక పెళ్ళి అయిపోయింది. అదేమొదటిదీ, ఆఖరిది, అప్పుడప్పుడు పెళ్ళి చేసుకోవడానికి ఇదేమన్నా అమెరికానా? ఆఫ్రికానా? మనం ఒక సంఘంలో బతుకుతున్నామనే సంగతి మరచిపోకూడదు. దీని గురించి సంఘం ఏమనుకుంటుంది?"

"సంఘంలో అందరికి తెలియడానికి, మనమేమయినా టముకు వేసి, చెప్పి ఈ పని చేద్దామా? దీని గురించి ఎవరికి తెలియవలసిన పనిలేదు. పేపర్ డైవోర్స్ లాగే ఇది కూడా గుట్టుచప్పుడుకుకాకుండా నడిచిపోతుంది."

"అహ! ఆ పేపర్ డైవోర్స్ గురించి ఎవరికీ తెలియదని అనుకుంటున్నావా? అంతః పురంలోని మాట అంగడి లోని పాట అనే మాట నువ్వు వినలేదా? అయినా, ఎంతో ఉత్తముడైన నా భర్తని మోసం చేయమంటావా?"

"అలాకాదు! కానీ, మీరు ఇద్దరూ కలిసి మిమ్మల్ని మీరే వంచించుంకుంటున్నారు... శరీరాల్ని, మనసుల్ని కూడా. మీరు, మీ తరువాతి తరాల్ని వంచిస్తున్నారు.... మీ ఇంట్లో తప్పటడుగులు వేస్తూ నడవాల్సిన ఆ చిరుపాదల్ని వంచిస్తున్నారు. మీ తల్లిదండ్రులు మీకు అప్పగించిన ఆస్తుల్ని వంచిస్తున్నారు. ఆ పరమేశ్వరుడు మీకు ప్రసాదించిన గర్భకోశాన్ని వంచిస్తున్నారు."

"అర్జునా! ఆపు నీ ధోరణి. ఇక నేనేం వినదల్చుకోలేదు."

"నేను నా భార్యకి పేపర్ డైవోర్స్ ఇవ్వడం... నామమాత్రంగా అయినా, మీచేత కూడా అలా చేయించడం మూలంగా, ఇవాళ మన ఇరువురి మనస్సాక్షులు స్వేచ్ఛా విహంగాలు అయిపోయాయి. శోభాయమానమైన భవిష్యత్తు కొరకు... నవ్వులతో నిండబోయే రేపటి

కొరకు.... సుందరమైన గృహ వాతావరణం కొరకు.. కొద్ది క్షణాలపాటు ఈ పవిత్ర బంధంలో పెనవేసుకుందాము. నేనిలా మాట్లాడేది, కోరేదీ తుచ్ఛమైన వ్యామోహం వల్లకాదు. కేవలం, కామతృష్ణ తీర్చుకోవడానికి ఇన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం లేదు. డబ్బు వెదజల్లితే, ఈ ప్రపంచంలో దొరకని దేమీ లేదు. కానీ, నాకిప్పుడు కావాల్సింది మీ సంతోషం ఒక్కటే. మీరు ఆడుతూ, పాడుతూ నవ్వుతూ గడపబోయే సుఖకరమైన భవిష్యత్తు నైతికంగా, అంతరాత్మపరంగా, అపరాధభావం అనిపించకుండా ఉండటానికే మనమిద్దరం వివాహబంధాల నుంచి విముక్తులమయ్యాము. ఇప్పుడు మన మిద్దరం ఒకటి కావడానికి ఎలాంటి ప్రతిబంధాలు లేవు. విఘ్నాలు లేవు. సంకెళ్ళు లేవు. మన ఈ పవిత్రసంబంధం గురించి మూడో కంటివాడికి తెలియాల్సిన అవసరం లేదు. నేను మిమ్మల్ని ఎప్పుడూ కూడా ఎక్స్‌ప్లాయిట్ చేయను. మిమ్మల్ని బ్లాక్‌మెయిల్ చేసేటంత నీచుణ్ణి కూడా కాను. ఈ సంబంధం ఒక ప్రత్యేక లక్ష్యం కొరకే. ఆ లక్ష్య సాధనకు మాత్రమే దీన్ని ఉపయోగిద్దాము. క్షణికమైన ఈ శారీరక బంధం, శాశ్వతమైన ఆత్మీయతా బంధానికి బాట వేస్తుంది. చాలా స్వార్థ రహితమైన ఉద్దేశ్యం నాది. దీని గురించి మీరెప్పుడూ పశ్చాత్తాపపడాల్సిన అవసరం రాదు."

రుద్రాణిదేవికి మరేమనాలో తోచలేదు. ఆమె మనసు ఒక కల్లోల జలధిలా మారింది. ఆ యువకుడి ముందు వివస్త్రగా నిలబడినట్లు ఆమెకి అనిపించింది. అతని ముఖంలోకి సూటిగా చూడటానికి ఆమె బిడియపడింది. తారుణ్యావస్థకు తను రివర్స్‌గేర్‌లో జారిపోతున్నట్టు కూడా ఆమెకు సందేహం కలిగింది. "ఈ వయసులో నాకు ఇంతసిగ్గు ముంచుకు వస్తుందేమిటి? భీమరావుతో గడిపిన మొదటి రాత్రి గూడా నాకిలాంటి వ్రీడాభావం కలగలేదు."

"అర్జునా! పద, ఇంటికిపోదాం. ఇక నీ సుత్తిచాలించు. నువ్వు చెప్పేది విని పడిపోవడానికి నేనేమి కాలేజీ అమ్మాయిని కాను. నీకన్నా నేను అయిదేళ్ళు పెద్దదాన్ని. కనీసం, అందుకయినా, నాకు గౌరవం ఇవ్వాలి. నీ అతి సాహసాన్ని నేను ప్రస్తుతానికి క్షమిస్తున్నాను. ఇహ, ఎప్పుడూ ఇటువంటి హద్దుమీరిన మాటలు వద్దు."

దానికి అర్జునరావు ఎటువంటి జవాబు ఇవ్వలేదు. ఇద్దరూ కారెక్కారు. సారథి తన కర్తవ్య నిర్వహణలో నిమగ్నుడయ్యాడు.

వెనుకసీట్లో కూర్చున్న ఆ స్త్రీ, పురుషులు కాస్సేపటి వరకూ ఏమీ మాట్లాడుకోలేదు. రుద్రాణిదేవి, కిటికీలోంచి అలా బయటికి చూస్తూ కూర్చుంది. అర్జునరావు, మెల్లగా తన ఎడమచేతి వేళ్ళను రుద్రాణిదేవి కుడిచేతి వేళ్ళమీదనిక్షేపించాడు. ఆమె ఒక్కసారి ఉలిక్కిపడింది?

కాని, ఆమె మృదుహస్తం వెనుకకి మాత్రం కదలలేదు. కొద్దిసేపటి తరువాత, అది అతని బలిష్టమైన చేతిక్రింద మెత్తగా నలిగింది. ఆ స్త్రీ కరం, ఆ పురుషకరం నుంచి సరీసృపంలా మెదులుతూ జారింది.

మౌనం వాళ్ళిద్దరినీ బాధిస్తోంది. ఆ ఇబ్బందికర వాతావరణం నుంచి బయటపడటానికి మొదట రుద్రాణిదేవే చొరవ చూపించింది. ఆ తరువాత, వాళ్ళు ప్రపంచంలోని వార్తలూ, ఇంటి విషయాలు, అన్నీ మాట్లాడుకుంటూ వెళ్ళారు. మరుసటి ఆదివారం మళ్ళీ ఆ ఫార్మ్ హౌస్‌కి వెళ్ళారు. ఈసారి, ఆమె అర్జునరావు కారులో వెళ్ళింది. అర్జునావు కారు నడుపుతుండగా, రుద్రాణిదేవి అతనితోపాటు, ముందు సీట్లోనే కూర్చుంది. ఫార్మ్‌లోని గెస్ట్‌హౌస్ ముందు కారు వెళ్ళి ఆగింది. రుద్రాణిదేవి చేతిలో నుంచి అర్జునావు తాళాలు తీసుకుని, ఆ గెస్ట్‌హౌస్ తలుపులు తెరిచాడు. ఈ లోపల అక్కడికి పరుగెత్తుకు వచ్చిన ఇద్దరు పనివాళ్ళని, ఏదో పనిచెప్పి బయటకు పంపించాడు.

థర్మాస్‌ఫ్లాస్క్‌లో తను తెచ్చిన కాఫీని రుద్రాణిదేవి రెండు కప్పుల్లో పోస్తుండగా, కారు డిక్కీలో పెట్టిన బుట్ట తీసుకు వచ్చిన అర్జునరావు, అందులో నుంచి ఒక పూలమాల తీసి, రుద్రాణిదేవి మెడలో వేసాడు. ఆకస్మికంగా, జరిగిన ఆ చర్యతో ఆమె రెండు నిముషాలపాటు స్తబ్ధురాలైపోయింది. "ఏమిటిది? ఎందుకీ దండ నామెడలో వేసావు?"

"నాకు ఒక్క పెద్ద కంపెనీ అకౌంట్స్ చూసే గొప్ప అదృష్టం ప్రాప్తించింది. ఆ సంతోషంతో... కానీ, దానికి మీరు నన్ను అభినందించాలి."అంటూ, అలాంటిదే మరో దండ తీసి రుద్రాణిదేవి చేతికి ఇచ్చాడు.

"ఈ రోజు నేను దీనికి అర్హుణ్ణి. అందుకే, నా మెడలో వేయండి." అని చెబుతూ తల కొద్దిగా వంచి, ఆమె ముందు నిలబడ్డాడు. ఒక స్వప్నంలోకంలో ఉన్నదానిలా, ఏం చేయాలో, ఏం చేయకూడదో, తెలియని క్షణంలో, ఆమె అప్రయత్నంగా, ఆపూలహారాన్ని అతని మెడలో వేసేసింది.

"ఇది దైవ నిర్ణయం. శుభముహూర్తం కూడా. ఈ మంచిరోజు కోసం, నేను ఎంతో కాలం నుంచి ఎదురు చూస్తున్నాను." అని అతను అంటూ ఉంటే, రుద్రాణిదేవికి ఏమీ అర్థం కాలేదు.

"దేవీ! ఇప్పుడు జరిగింది మన వివాహమే... భగవంతుడి సాక్షిగా మాత్రమే, జరిగిన వివాహం, ఇప్పటి నుంచి మనం భార్యాభర్తలం."

సంభ్రమావస్థ నుంచి బయటపడుతూ, రుద్రాణిదేవి తన పుష్పహారాన్ని తీసి బల్లమీద పెట్టింది, "అర్జునా! ఈ పిచ్చి పనులు ఇంతటితో ఆపు. ఎవరయినా చూస్తే! ముందీ పూలమాలలు రెండూ తీసి బుట్టలో పెట్టి డిక్కీలో పడేయ్!" అని ఆజ్ఞాపించింది.

మప్పితం గల ఒక అబ్బాయిలాగా, అతను ఆమె చెప్పినట్టు చేస్తూ ఉండగా, "నీకిప్పటికీ పిల్ల చేష్టలు పోలేదే!" అంది రుద్రాణిదేవి.

'ఇవి పిల్ల చేష్టలు కావు. - పిల్లలకై చేష్టలు. దానికి ప్రధమరంగం" అంటూ అతను బయటికి వెళ్ళి, ఆ బుట్టని కారు డిక్కీలో పెట్టగా, రెండు కప్పుల కాఫీతో, రుద్రాణిదేవి కారు దగ్గరికి వచ్చింది. కాఫీ తాగిన తరువాత, వాళ్ళు మళ్ళీ గెస్ట్‌హౌస్‌లోకి వెళ్లలేదు. గెస్ట్‌హౌస్‌కి తాళంవేసి, తోటలో అటూ ఇటూ తిరుగుతూ, పనివాళ్ళకి పనులు పురమాయిస్తున్నట్టు పెద్ద హంగామా చేసి వాళ్ళ తిరుగుప్రయాణం కొనసాగించారు. కారు నడుపుతూ, నడుపుతూ పల్లవ పాణిగ్రహణం చేస్తూండగా, ప్రతిఫలంగా అతనికి చురుక్కుమన్న గిల్లు సంప్రాప్తమైంది. వాళ్ళిద్దరూ కాస్సేపు నవ్వుకున్నారు. అతను ఆమె బుగ్గలని మునివేళ్ళతో తడిమి, తన వేళ్ళను తానే ముద్దుపెట్టుకొన్నాడు. రుద్రాణి దేవి సిగ్గుపడింది? "పిచ్చివాడు" అని ఆమె చెవిలో గుసగుసలాడింది.

కాలచక్రం గిర్రున తిరిగింది. రుద్రాణిదేవి కొడుకు అయిదు సంవత్సరాల విజయ్ ఫస్ట్‌క్లాస్‌లో చదువుతున్నాడు. అతని చెల్లెలు వైజయంతికి రెండేళ్ళు నిండాయి కానీ, రుద్రాణిదేవికి ఆమెను ఒడిలో నుంచి దించేటంత సమయం కూడా దొరకటం లేదు. ఆ కుటుంబంలో ఆనందతరంగాలు వెల్లివిరిశాయి. సకలైశ్వర్యాలు నిండిన ఒక సంతృప్త కుటుంబం, కొడుకుని స్కూలుకి తీసుకువెళ్ళేదీ, తీసుకు వచ్చేదీ ప్రౌఢపితయైన భీమరావే. ఆ పని ఎవరికయినా అప్పజెప్పడమనేది అతనికి నచ్చని విషయం.

అర్జునరావు, ఆ ఇంటికి ఎప్పుడు వచ్చినా, పిల్లలతో వీలైనంత ఎక్కువ సమయం గడుపుతుండేవాడు. పిల్లలకి కూడా ఆ అంకులంటే ఎంతో ఇష్టం. పిల్లలకు ఇష్టమైన చాక్లెట్లూ, ఆట వస్తువులూ అన్నీ కొనిస్తూ ఉండేవాడు.

అర్జునరావు ఇల్లు కూడా సుఖ సంతోషైశ్వర్యాలతో కళకళలాడుతోంది. లక్ష్మికి ఇప్పుడు ఒక తమ్ముడున్నాడు. ఫామిలీ ప్లానింగ్ పూర్తి అయిన గిరిజకు భర్త గురించి, మునుపున్న దానికన్నా ఎన్నో రెట్లు అభిమానం ఎక్కువైంది. దానికి కారణం, అతను ముందు ప్రవచించినట్టు ఒక కొడుకు పుట్టడం మాత్రమే కాదు. ఈ రోజు ఆ ఇంట్లో రెండు కార్లు ఉన్నాయి. సుఖభోగాలకు కావాల్సిన వస్తువులన్నీ ఉన్నాయి. ఖర్చు పెట్టగలిగిన దానికంటె, పుష్కలంగా డబ్బు ఉంది.

రుద్రాణిదేవికి కావల్సినవన్నీ భీమరావు సమకూరుస్తాడు. అర్జునరావుకు కావల్సినవన్నీ రుద్రాణిదేవి సమకూరుస్తుంది. గిరిజకి కావలసినవన్నీ అర్జునరావు సమకూరుస్తాడు. పేపర్ డైవోర్స్‌ల పుణ్యాన కాకపోతే, ఆ రెండు కుటుంబాలకీ, ఇన్ని సౌఖ్యాలు ఉండేవా?

ఫామిలీ ప్లానింగ్ వాళ్ళు, "చిన్న కుటుంబం - చింతలు లేని కుటుంబం"అని అంటే, వివాహ మోచిత కుటుంబం సంతృప్త కుటుంబం" అని ఈ భీమార్జున కుటుంబాలు అభిప్రాయపడతాయేమో!

ఆ విధంగా, ఆ రెండు కుటుంబాలు సుఖ సంతోషాల్లో మునుగుతూ, తేలుతూ ఉండగా, వైజయంతి మూడో పుట్టిన రోజుకు, అర్జునరావు సతీసమేతంగా మధ్యాహ్న భోజనానికి రావాలని రుద్రాణిదేవి ఆజ్ఞ జారీచేసింది. అప్పటివరకూ, రుద్రాణి, గిరిజల సమావేశానికి ఏమాత్రం అవకాశం ఇవ్వని అర్జునరావు, ఆ విందు పిలుపులో ఇరవై అయిదు శాతం మాత్రం అంగీకరించడానికి సిద్ధపడ్డాడు.

"ఆ రోజు ఆదివారమే కదా! పిల్లలకు స్కూలు లేదు. గిరిజని, పిల్లల్ని నేను ఎంతో కాలం నుంచి చూడాలనుకుంటున్నాను. నేను వాళ్ళని చూడటం వలన, వాళ్ళకి గానీ, నీకు గానీ, ఎటువంటి నష్టం కలగదు. నేను వాళ్ళనేం మింగేయను. తరువాత, నాచెల్లెల్లాంటి గిరిజకు కూడా నన్ను చూడాలన్న ఆసక్తి ఉండవచ్చు. ఆమెతో నీ విషయాలేమీ నేను చర్చించను." అని రుద్రాణిదేవి మాట ఇచ్చినప్పుడు, ఇక అతనికి అభ్యంతరం చెప్పే వీలులేకపోయింది.

ఉదయం, దాదాపు పదకొండు గంటలకి, భీమరావు నిలయంలోని పోర్టికోలో, అర్జునరావు కారు వచ్చి ఆగింది. అర్జునరావు, గిరిజా, పిల్లలూ డ్రాయింగ్‌రూంలో వచ్చి కూర్చోగానే, రుద్రాణీ, పిల్లలు విజయ్, వైజయంతి అక్కడికి వచ్చేశారు. అర్జునావు పిల్లల్ని విజయ్ స్విమ్మింగ్‌పూల్ దగ్గరకు పోదాం, రమ్మన్నాడు. తన పిల్లలకి ఈతరాని కారణం చేత, గిరిజకి, వాళ్ళని నీళ్ళ దగ్గరికి పంపించడం ఇష్టం లేదు.

"ఆంటీ! స్విమ్మింగ్‌పూల్‌లో ఎక్కువ నీళ్ళు లేవు. చూడండీ, ఇంతవరకే వున్నాయి." అంటూ, విజయ్ తన గుండె మీద చెయ్యిపెట్టి నీటిమట్టం చూపించాడు.

"బాబూ! స్విమ్మింగ్ చేయడానికి కావలసిన బట్టలు వీళ్ళుతెచ్చుకోలేదు."అని గిరిజ ప్రాక్టికల్ ఇబ్బంది గురించి చెపుతున్నప్పుడు,

"ఈ అక్కకి నా డ్రెస్సు సరిపోతుంది. వైజయంతీ, తమ్ముడు బయట కూర్చుని మేము ఈత కొట్టడం చూస్తూ ఉంటారు." అని ఆచురుకైన కుర్రాడు చెప్పాడు. వెంటనే, అతను

లక్ష్మికి ఒక టీ షర్టు ఇవ్వడం జరిగింది. ఆ టీషర్ట్ తొడుక్కుని, నీటిలోకి వెళ్ళాలని ఆసక్తిగా ఉన్న లక్ష్మి విజయ్‌తో పాటు స్విమ్మింగ్‌పూల్‌లోకి దూకి, కాళ్ళూ చేతులూ టపటపలాడిస్తూ కేరింతలు కొట్టసాగింది. అది చూస్తూ, సిమ్మింగ్‌పూల్ పక్కన కూర్చున్న శిశుప్రేక్షకద్వయం కరతాళ ధ్వనులు చేశారు. పన్నెండున్నరకి, రుద్రాణీ, భీమరావుల బలవంతం వలన వాళ్ళు సిమ్మింగ్‌పూల్ నుంచి బయటకు వచ్చి తడిబట్టలు మార్చుకున్నారు.

ఆ క్షణంలో, గిరిజకి గుండె బద్దలయ్యేటంత దృశ్యం ఒకటి గోచరించింది. విజయ్ వీపుపైన ఎడమభాగంలో ఆస్ట్రేలియా, శ్రీలంకల్లాంటి రెండు తేనెరంగు పుట్టుమచ్చలు!! తన కళ్ళని తనే నమ్మలేకపోయింది. గుండెల్లో రాయిపడ్డట్టు, తన చుట్టూ ఉన్న ప్రపంచం గిర్రున తిరుగుతున్నట్టు ఆమెకి అనిపించింది. పడిపోకుండా ఉండటానికి, పక్కన ఉన్న స్థంభాన్ని ఆసరాగా పట్టుకోవలసి వచ్చింది. ఆమె ముఖం వివర్ణమైంది. ఫాలభాగాన స్వేదబిందువులు ఏర్పడ్డాయి. అతి కష్టంమీద ఆమె భోజనాల గది వరకూ చేరింది.

డైనింగ్ టేబిల్ దగ్గర కూర్చుందే గానీ, ఆమెకు ఏమీ తినబుద్ధి కాలేదు. తన కంచంలో రుద్రాణిదేవిని ఏమీ వడ్డించనివ్వలేదు. కాస్త అన్నం, పెరుగూ వేసుకుని ఏదో ఎంగిలి పడిందనిపించి, చేతులు కడుక్కుని తిరిగి డ్రాయింగ్ రూంలోకి వెళ్ళి కూర్చుంది. తక్కినవాళ్ళు భోజనంచేసి, తిరిగి వచ్చేసరికి, దాదాపు అరగంటపాటు ఏకాంతంగా నిప్పులు మింగడమనే కార్యక్రమం పూర్తిచేసింది. తన ఒంట్లో బాగా లేదని, వెంటనే ఇంటికి వెళ్ళాలని గిరిజ తొందర పెట్టడంతో, అర్జునరావు అక్కడ ఎక్కువ సమయం గడిపే అవకాశం లేకపోయింది. విజయ్‌ని, వైజయంతిని ఆప్యాయంగా ముద్దులు పెట్టుకుని, ఆ అంకుల్ తన స్వంత భార్యా పిల్లలతో కారులో అలా వెళుతూంటే, వెనుకనుంచి, ఆ చిన్నారులు, టాటా చెప్తూ, చెయ్యి ఊపడం గిరిజ చెమర్చిన కళ్ళతో చూసింది.

తలనొప్పిగానూ, వాంతి వచ్చేటట్టుగానూ ఉంధని చెప్పి, గిరిజ బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి పడుకుంది. డాక్టర్‌ని పిలిపిద్దామని అర్జునావు అంటే, "అక్కర్లేదు, అయిదు నిముషాలు విశ్రాంతి తీసుకుంటే, అదే తగ్గిపోతుంది." అని ఆమె జవాబిచ్చింది.

మరుసటిరోజు ఉదయం, అర్జునరావు పనిమీద బయటికెళ్ళి సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంట్లో పిల్లల గోలేమీ వినిపించలేదు. అలవాటు ప్రకారంగా ఇంట్లోకి వచ్చి, "గిరిజా! గిరిజా!" అని పిలిచేసరికి అతని ముందు గిరిజకు బదులుగా ప్రత్యక్షమయినది, ఆ ఇంటి పనిమనిషి వెంకమ్మ.

"అయ్యా! అమ్మగారు, పిల్లల్ని తీసుకుని, మధ్యాహ్నమే కారులో వెళ్ళిపోయారు. ఎక్కడికి వెళ్తున్నారో నాకేమీ చెప్పలేదు. రెండు మూడు పెట్టెలు కూడా తీసుకువెళ్ళారు. మీకివ్వమని

చెప్పి ఈ ఉత్తరం నా చేతికి ఇచ్చారు." అని వెంకమ్మ భయపడుతూ, ఆ ఉత్తరాన్ని అతనికి అందించింది.

"నేనూ, నా పిల్లలూ ఈ ఇల్లు వదిలివెళ్ళిపోతున్నాము. మా గురించి వెతికి, నా ఇంటికి వచ్చే ప్రయత్నం చేయవద్దు. అన్ని విషయాలు మా నాన్నగారికి చెప్పదలుచు కున్నాను. దాని తరువాత మీరు ఆయనను కలిస్తే ఏం జరుగుతుందో నేను చెప్పలేను. అందుకే, నాకుగానీ, నా పిల్లలకు కానీ, ఏమీ కాని మీరు మమ్మల్ని కలవద్దు."

"ఒక మహాగణికుడి భవనంలో, ఒక మహాగణికగా పడి ఉండటం నాకు ఇష్టంలేదు. నా ఈ నిర్ణయానికి విరుద్ధంగా మీరు ఏ న్యాయస్థానానికి వెళ్ళినా లాభం లేదు. మీ నుంచి దూరం కావడమనే అదృష్టానికి కారణమైన ఆపేపర్ డైవోర్స్‌కి నేను సర్వదా కృతజ్ఞురాలిని."